# మురికి కాలువ మనిషి మనసు



-మా హనుమంతరావు

ఆ సందులో నడిచే వాళ్ళు నమ్రతతో నమ్మకమైన నౌకరుల వలె తలలు వంచి తమ మోహ భంగిమలు బయటికి కనపడనీయకుండా ఊపిరి బిగపెట్టి నడుస్తూ ఉంటారు. అది వారి స్వభావం కాదు. వారి గొప్పతనమూ కాదు. ఆ సందులో సజీవంగా ప్రవహించే మురికి కాలవే కారణం. ఆ సందులోని వాళ్ల మురికిని మోయలేక భారంగా, మంద కొడిగా ప్రవహిస్తూ అప్పుడప్పుడు మాన వుల కర్కుడు గట్టిన కల్మషం అడ్డురాగా పొంగి పొరలి మట్టిరోడ్డుని రొంపి చేస్తూ నడిచే వాళ్ల ఒళ్లు దగ్గర పెట్టు కుని నడిచేట్లు చేస్తున్న దా మురికి కాలవ. దానికి మనుష్యులంటే కసి. కోపం. వాళ్ళు తమ మాలిన్యమంతా తన కంటగట్టి ఎందుకు తన్నింత హీనంగా, హేయంగా చూస్తున్నారో దానికి అర్థం కావడం లేదు. అందుకే తనని చూసి దూరదూరంగా, భయం భయంగా పోతున్న వాళ్ల వంక చూస్తూ, 'అరేయ్, అరేయ్! ఎందుకురా అలా ముక్కులు మూసుకుని అసహ్యించుకుంటారు? నే నెవర్నిరా? మీ శారీరక మురికిని. మలినాన్ని. నన్ను శుభ్రపరచండిరా. అరేయ్, ఎందుకురా నన్ను ఈసడించు కుంటారు? మిమ్మల్ని మీరే దగా చేసుకుంటున్నారురా? భౌతికంగామీఒంటి మీద మట్టిని, కంపుని తొలగించుకున్నా, మీ మనసులోని చీకటిని రూపుమాపుకో లేక పోతున్నారు. మీకన్నా పశు పక్ష్యా దులు నయం' అంటూ ఉక్రోషంగా తనని దరిచేరిన ఈగల్ని, దోమల్ని, పురు గుల్ని, కాకుల్ని, కుక్కల్ని, పందుల్ని ఆప్యాయంగా ఆహ్వానించసాగింది.

చైత్రమాసపు సూర్యుడు చిరచిర లాడుతూ ఆఫీసుకి ఆలస్యంగా వచ్చిన నౌకర్ని దండిస్తున్న అధికారిలా ఉన్నాడు. దుర్గంధపు గాలి ఆ సందులో వాళ్ల చెంపల్ని వాయిస్తున్నట్లు వీస్తున్నది. "వెంకడు ఇంకా చావలేదు. వెధవ పది పైసలకోసం పదిసార్లు తిరుగుతాడు. పండుగనాడు ఇంటిచుట్టూ ప్రదక్షిణాలు చేస్తాడు" అంటూ మురికి కాలవ బాగు చేసే వెంకడిని దీవిస్తూ వీథి గుమ్మం లోంచి చెత్త బుట్టని రోడ్డుమీద కుమ్మరించిం దో ఇల్లాలు. ఎదురింటి ఇల్లాలు తన యథాశక్తి తుక్కుని సైడు కాలవలో దిమ్మరించింది. మేడమీది మీనాక్షమ్మ తన వాటా అరిటితొక్కల్ని అవలీలగా క్రిందికి విసిరి కొట్టింది.

ఆ సందు మొదట్లో ఒక చెత్త కుండీ, పెంట దిబ్బా ఉన్నట్లు కనపడుతున్నాయి. అది చెత్తకుండీ కాదు. పవ్వళించిన వరహాల గుంపు అది. దాని పక్కనున్నది పెంట దిబ్బ కాదు. చతికలపడి కూర్చున్న వెంకడు. ఎర్రని తలగుడ్డ, బనీనులాంటి చొక్కా వేసుకున్నాడు. లాగు లాంటిది ఉన్నట్లు కనపడుతున్నది. వాడు ఎంగిలి బీడీని సీరియస్‌గా తాగుతూ మధ్య మధ్య నోరు చప్పరిస్తున్నాడు. ఏదో తెలియని బాధతో, భయంతో, అసహ్యంతో వణికి పోతున్నాడు. ఉడికిపోతున్నాడు. గత రెండు రోజులుగా వాడి దగ్గర డబ్బులు లేవు. వాడు ప్రభుత్వం వారి సారాయి రుచి చూసి ఇరవై గంట లయింది. తేనె టీగల్లా ముసురుతున్న ఈగల్ని, దోమల్ని తోలుతూ వెంకటమ్మ అమ్మే నాలుగు రోజుల నాటి పకోడీలు తిని రెండు రోజు లయింది. చీకటిలో అరవై పైసల సుబ్బిని తడిమి చాలా రోజు లయింది. ఇవన్నీ అతనికి బాధగా లేవు. వెంకి రాత్రి సంపాదనతో గత రాత్రి ముష్టివాడిలా తిన్న మాంసం అతని కడుపులో తిప్పుతున్నది.

"ఛా, ఎదవ బతుకు. ఆలికి కూడెట్ట లేని బతుకు. పోదూ ... పోతాది. పది పైస లెవ డిస్తే ఆడితోనే పోతాది. ఛా, ఎదవజనమ" అంటూ బీడీని కింద పడేశాడు.

"ఎంత గొంతు సించుకున్నా పది పైసాలు విదల్చలేదు. ఈ సందులో వాళ్ళు అంతా సదువుకున్నాళ్ళు. ఉద్యోగస్థులు. గంగమ్మ తల్లొంటి బూదేవత గరబంలో బంగారం ఉంటుం దంటారు. రెండు దినాల కాడనుంచి ఎంత ఎతికినా నయాపయిసా కూడా

దొరకలేదు. . . ఎదవ జనమ" అంటూ తిరిగి విసుక్కుంటూ షట్టు వదిలిన విక్రమార్కుడిలా చిరుగుల చేట, మొండి చీపురు ఒక చేతితో, చిన్న రేకుల డబ్బా ఇంకో చేతితో పట్టుకుని మురికి కాలవని పరిశీలించుకుంటూ పోతూ, ఉప్పెనగా పొంగిన చోట ఆగి అక్కడ ముందు కాలవలో చేతులు జొనిపి ఆత్రంగా మట్టిని చేటలో వేయసాగాడు. ఆ తర వాత మురికి నీటిని డబ్బాతో మట్టిమీద పోస్తూ మొండి చీపురుతో మట్టిని కలియతిప్పి ఆదుర్దాగా వెతికాడు. మట్టినంతా కెలికాడు. ఫలితం శూన్యం. 'లెగ్గానె ఒవుడి మొకం సూసినానో' అని విసుక్కుంటూ ఆ మట్టిని రోడ్డు పక్కన పోసి మళ్ళీ ఇంకోచోట ప్రయత్నించాడు. అతని కళ్ళు మిలమిల మెరిశాయి. నీళ్ళలో చేపపిల్లలా నల్లటి మట్టి మధ్య తెల్లని వెండి రూపాయి బిళ్ళ. పది రూపాయిల బిళ్ళ. పావురాన్ని నిమిరినట్లు ఆప్యాయంగా దాన్ని నిమిరాడు. మబ్బి శరీరాన్ని నలిపినట్లు దాన్ని పిడికిటిలో బంధించి రోడ్డు వైపు తేరిపార చూసి గబుక్కుని లేచి నించున్నాడు. సైడుకాలవ పక్కనున్న భవనం వంక చూశాడు.

* * *

కొన్ని వందల సీతాకోకచిలకలు వాలిన మొక్కల్లా ఉన్నాయి రంగు రంగుల పూల మొక్కలు. ఆ ఇంటి వారి పచ్చదనం చాటుతున్నాయి లాన్ చుట్టూ పెరిగిన చెట్లు. లాన్ వెనకాల కేకులతో కట్టిన కట్టడం వలె చూపరులకి మధురమైన ఆలోచనలు కలిగించే అందమైన మేడ ఉంది. ఆ మేడ ముందు పోర్టికోలో ఆగిన ఫారిన్ వైట్ కలర్ కారు పావురాళ్ల గుంపులా ఉంది. విరబూసిన మల్లె పందిరిలా ఉంది. ఆ ఇంటి మెయిన్ హాల్లో కూర్చున్న ఆనందరావు గారు సానపెట్టిన వజ్రంలా మెరుస్తున్నారు. ఆయన చేతిలోని లాటరీ టికెట్లు స్వర్గానికి ఇచ్చిన ఫ్రీపాసుల్లా రెపరెపలాడుతున్నాయి.

ఆయన ఆదుర్దాగా పేపరులో లాటరీ రిజల్ట్స్ చూస్తున్నారు. అంతలో ఆయన గారి శ్రీమతి షో కేసులో బొమ్మలా ఆయన ముందు నించుని, "నిన్న పాప కిచ్చిన పది రూపాయలు తీసుకున్నారా?" అని అడిగింది.

"పాపేమిటి? పది రూపాయ లేమిటి?" అన్నారు ఆదుర్దాగా తల పైకెత్తి ఆనందరావుగారు. డబ్బు పేరెత్తగానే పడగ విప్పిన పాములా మారిపోతారు.

"నిన్న పది రూపాయిల బిళ్ళ."

"ఏదీ? వెండిది. గాంధి గారిది. పాప పారేసిందా?" అన్నారు, చురుగ్గా భార్య మాటలకి అడ్డు వస్తూ.

"నిన్న సాయంకాలం తీసుకుంది. లాన్‌లో ఆడుకుంది." ఆవిడ ఏదో ఆలోచిస్తూ ఆగింది.

"రాత్రంతా ఏం చేస్తున్నావ్? అయినా దాని కెందు కిచ్చావ్" అన్నారాయన కొంచెం కోపంగా.

"నిన్న సాయంకాలం మిసెస్ రంగనాథం, మిస్ సుధా వచ్చారు. వాళ్లతో ఎంగేజై మారాం చేస్తూ ఉంటే ఇచ్చాను. అది ఆడుకోవడానికి వెళ్లినప్పుడు ... ఎస్... ఎస్...మల్లయ్యా... మల్లయ్య తోటపని చేస్తున్నాడు" అంటూ మాటలు త్రుంచి త్రుంచి అంది.

అంతే. తుపాకిని పేల్చినట్లు కేకలు వేశారు ఆనందరావుగారు.

"మల్లయ్యా ... మల్లయ్యా!"

"వస్తున్నాను, బాబూ, వస్తున్నాను" అంటూ తలగుడ్డ చుట్టుకుంటూ వచ్చాడు మల్లయ్య. కాయకష్టం చేసుకునే కర్షకుడి, కార్మికుడి నుదుటను మెరిసే చెమట బిందువులా ఉన్నాడు. నలభై సంవత్సరాలు నిండకపోయినా, అరవై నిండిన వాడిలా కనపడుతున్నాడు.

"పాప దగ్గర తీసుకున్న పదిరూపాయ లేవిరా?"

"పాపగారిదగ్గరా?" అన్నాడు ఆశ్చర్యంగా, అమాయకంగా మల్లయ్య.

"అదేరా... వెండి రూపాయి. పది రూపాయల బిళ్ళ. గాంధి గారిది."

"పది రూపాయలా? గాంధిగారిదా?"

"నీకేం తెలీదూ? చెప్పరా నిజం, ఇడియట్!" ఆయన ఆఫీసర్.

"నాకేం తెలీదండి." మల్లయ్య వంగిపోతున్నాడు. అతను ప్యూన్.

"నిన్న సాయంకాలం నువ్వు తోటపని చేస్తున్నావు. పాప రూపాయి బిళ్లతో ఆడుకుంటున్నది..."

ఆయన మాటలకి అడ్డువస్తూ వినయంగా అన్నాడు మల్లయ్య:

"పాపగారు బంతితో ఆడుకోవడం చూశానండి. పెద్దమ్మగారు పిలిస్తే లోపలికి వెళ్లడం చూశానండి."

"అవును. అప్పుడు అది మరిచిపోయి జారవిడిచిన పది రూపాయిల బిళ్ల కాజేశావు. మర్యాదగా ఇవ్వు."

"అదేంటి, బాబూ, అలా అంటారు? నే నలాంటి వాణ్ణి కాదు, బాబూ. నాకేం తెలీదు" అన్నాడు మల్లయ్య రోదనాపూరిత స్వరంతో.

"రాస్కెల్! దొంగవేషాలు వేయకు. నా కంతా తెలుసు."

"అమ్మాయిగారు పొరపాటున సైడు కాలవలో పారేశారేమో" అంటూ సాలోచనగా ఆగాడు మల్లయ్య. వెంటనే అందుకున్నారు ఆనందరావుగారు:

"నీ బుర్రలో పడిన ఆలోచన చాలా చక్కగా ఉందిరా. సైడు కాలవలో పడిందో లేక నీ చొక్కా జేబులో పడిందో


# నానబెట్టిన ధాన్యాలను రుబ్బు మెషినులు

## (SOAKED FOOD GRAINS GRINDING MACHINES)



* మా మినీ టైప్ గ్రైండర్ గృహావసరాలకు చాల అనువైన నమూనా. ప్రతి ఇంటా అవశ్యం ఉండవలసినది.

* మా మెషినులు ఉన్నత సాంకేతిక నిపుణులచే తయారుచేయబడినవి. గ్యారంటీతోను మంచి సర్వీసు హామీతోను అమ్మబడుచున్నవి.

* ఇళ్ళలో వాడదగిన సైజు మంచి, హోటళ్ళలో, కాంటీన్లలో మరియు వ్యాపారసరళిలో వాడదగిన వాటివరకు వివిధమైన 25 కు పైబడిన నమూనాలు మావద్ద హాజరుగ లభిస్తున్నవి.

* దక్షిణభారతదేశంలో మా మెషిన్లు 2500 లకు పైగా మా వాడకందార్లకు పూర్తిగ సంతృప్తికరంగా పని చేస్తున్నవి.

* మేము కాఫీగ్రైండర్లు, రోస్టర్లు, ఉర్లగడ్డ పెచ్చుతీయు మెషిన్లు, పీటపంపుసెట్లు, పిండిమరలు మొదలైనవాటినికూడ సప్లయి చేస్తున్నాము.



ఇతర వివరాలకు దయచేసి వ్రాయండి:

## శ్రీ బాలాజీ మిల్ స్టోర్స్,

**145/ఎ, రాష్ట్రపతి రోడ్డు, సికింద్రాబాద్—3.**

ఫోన్లు: ఆఫీసు: 77327 నివాసం: 78103

ARTEX

చూసే బలం ఎవరికీ లేదు. అంతా శారీరకంగా, మానసికంగా బలహీనులు. ఆయన ఖాతాదారులు. ఏదోవిధంగా ఆయన గుప్పెట్లో ఉన్న వారు. అందుకనే ఎవరూ ముందుకు రాలేదు. మూకీ సినిమాలా కొద్ది క్షణాలు గడిచాయి.

మల్లయ్య నోట మాట పెగలటం లేదు. ఒళ్ళు చల్లబడుతున్నది. తాను అబద్ధం చెబుదామని నిజం ఎలా చెప్పగలిగాడు? 'బ్రహ్మదేవుడా, నాకు ఇటువంటి బుద్ధిని ఎందు కిచ్చావయ్యా?' అంటూ వాపోతున్నాడు.

"సావుకారూ, మరియాదగా మాటాడు. అగ్గితో సెలగాటా లాడకు, ఇచ్చేయ్ ... కొరవ పైన లిచ్చేయ్" అంటూ అగ్గమీద గుగ్గిలంలా ఉన్నాడు వెంకడు.

"ఏమిట్రోయ్, వీాది వీాదికి వస్తున్నావ్? కొడతావా? కొట్టు, చూద్దాం. పట్ట పగలు కంట్లో కారం కొడదామనుకుంటున్నావా?"

"పా న కా లు గా రూ" అంటూ మల్లయ్య ఏదో చెప్పబోయాడు.

"నువ్వూ వాడితో కలిసి దొంగ నాటకం ఆడుతున్నావా? ఇద్దరూ కలిసి దొమ్మీ చేయడానికి వచ్చారు. ఈ నక్సలైట్ చేష్టలు నా దగ్గర సాగవు." పానకాలు ఆవేశంతో వణికిపోతున్నాడు.

"ఏమిటయ్యో గోల చేస్తున్నావు? డబ్బు ఇస్తావా, ఇవ్వవా?" అంటూ కొంచెం ముందుకు వచ్చాడు వెంకడు. మల్లయ్య వాణ్ణి వెనక్కి లాగాడు. పానకాలు శివం ఎత్తినట్లు ఊగిపోతూ, "కొట్టండిరా, కొట్టుని లూటీ చేయండిరా" అంటూ అరుస్తున్నాడు.

అంతలో ఆ రూట్ బీట్ కానిస్టేబుల్ ఫుట్‌పాత్ వ్యాపారుల్ని పలకరించుకుంటూ పానకాలు కొట్టుముందు జనం అలజడి చూచి అక్కడికి వచ్చాడు.

"వచ్చారా? మీాకోసం కబురు పంపుదా మనుకున్నాను" అన్నాడు పానకాలు రొప్పుతూ, ఆయాస పడుతూ.

"ఏం ... పంచదార వచ్చిందా?" అన్నాడు పోలీస్ మామూలుగా.

"ఏ పంచదార బంగారంగాను ... ఈ మల్లయ్యా, ఆ వెంకడూ నా కొట్టు దొమ్మీ చేయడానికి వచ్చారు. నన్ను కొట్టడానికి వచ్చారు" అంటూ ఉన్నవి, లేనివి కల్పించి చెప్పసాగాడు పానకాలు.

"పదండి స్టేషన్‌కి" అన్నాడు కానిస్టేబుల్.

"మేం ఏపను కెందుకండి" అన్నాడు వెంకడు.


"మేం ఏం చేయలేదండి" అన్నాడు మల్లయ్య.

"అవన్నీ స్టేషన్‌లో చెబుదురుగాని. ముందు పదండి" అంటూ లాఠీకర్ర ఆడించాడు పోలీస్ కానిస్టేబుల్.

"పంచదార రాగానే కబురు పంపు తాను లెండి" అంటున్నాడు పానకాలు.

అది రోడ్డు. జనం ఉన్నారు. సినిమా చివర 'శుభం' అని రాగానే వెళ్లిపోయిన ప్రేక్షకుల్లా కదిలి వెళ్లిపోయారు.

"మురికి కాలవ నెవరో కెలికినట్టున్నారు. వెలిగించరా అగరవొత్తులు" అని అరిచాడు పానకాలు. కాని, అప్పటికే మల్లయ్యని, వెంకడిని వెంటబెట్టుకుని పోలీస్ వెళ్లిపోయాడు. *



భద్రకాళి ఆలయం (వరంగల్లు)

